సాక్షి
వికారాబాద్
ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



పర్యవేక్షణ లేక.. అధ్వాన స్థితి

రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదు.

10లో ▸



వికారాబాద్‌లో బీసీ జేఏసీ నాయకుల ర్యాలీ

న్యూస్‌రీల్

బోటనీ లెక్చరర్ శ్రీనివాస్‌కు ఓయూ డాక్టరేట్



కొడంగల్ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఆర్.శ్రీనివాస్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఓయూ బోటనీ ప్రొఫెసర్ ఎస్.లక్ష్మీభవాని పర్యవేక్షణలో 'స్టడీ ఆఫ్ బయోయాక్టివ్ కాంపౌండ్స్ ఆఫ్ మెడిసినల్ ప్లాంట్స్ ట్రెడిషనల్లీ యూజ్డ్ ఫర్ జాండీస్, బోన్ సెట్టింగ్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై శ్రీనివాస్ తన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారన్నారు. డాక్టరేట్ పొందిన శ్రీనివాస్‌ను కాలేజీ సిబ్బంది అభినందించారు.

శివాలయ ప్రారంభానికి గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్ జిష్ణుదేశ్‌వర్మను కలిసిన రాఘవేందర్‌గౌడ్ తదితరులు

కుల్కచర్ల: మండలంలోని ఘణపూర్ గ్రామంలో నిర్మిస్తున్న శివాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను పరిగి పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆలయ ప్రారంభోత్సవానికి సమయం కేటాయించాలని విన్నవించారు. దీనికి గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. వీలు చూసుకొని త్వరలోనే తేదీని ప్రకటిస్తానని సూచించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జాట్ రాష్ట్ర అధ్యక్షుడు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు యూటీఎఫ్ అండ

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి



చెక్కు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కుల్కచర్ల: ఉపాధ్యాయులకు అండగా ఉంటామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అన్నారు. ఇటీవల మృతిచెందిన కుల్కచర్ల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు శనివారం సంఘం తరఫున రూ.6 లక్షల చెక్కు అందజేశారు. బాధితులకు అండగా నిలిచేందుకు యూనియన్ తరఫున సంక్షేమ నిధి ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎవరూ అధైర్యపడొద్దని సూచించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘం ఎప్పుడు ముందు ఉంటుదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎంఈఓ అబీబ్‌అహ్మద్, చౌడాపూర్ ఎంఈఓ రాంచందర్, బీజేపీ జిల్లా మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, సంఘం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పరిగి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చిత్రంలో నాయకులు



తాండూరు: నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే బీఎంఆర్, బీసీ సంఘాల నేతలు

బీసీ | నిరసన గర్జన

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం తలపెట్టిన రాష్ట్ర బంద్ విజయవంతం అయింది. బీసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్‌కు అధికార, ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. నినాదాలు, రాస్తారోకోలతో నాయకులు హోరెత్తించారు. వికారాబాద్, పరిగి, తాండూరులలో మధ్యాహ్నం వరకు ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దుకాణ, వ్యాపార సముదాయాలు సైతం మూసి వేశారు. పరిగిలో డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో సహా అన్ని పార్టీల నేతలు హైదరాబాద్–బీజాపూర్ హైవేపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తాండూరులోనూ అన్ని పార్టీల నేతలతో కలిసి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బంద్‌లో పాల్గొని విజయవంతం చేశారు. కొడంగల్‌లో సైతం బంద్ ప్రభావం కనిపించింది.

– వికారాబాద్




వికారాబాద్‌లో డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు



కొడంగల్: ధర్నాలో పాల్గొన్న అఖిల పక్ష నాయకులు

తగ్గేదే లే..!



అక్రమార్జనే ధ్యేయంగా ఎంచుకున్న ప్రభుత్వ ఉద్యోగులు సామాన్యుల పాలిట యమ కింకరులుగా మారారు. బాధ్యతగా చేయాల్సిన విధులకు సైతం లంచాలు నొక్కేసి ప్రజలను పీడిస్తున్న ఉదంతాలు పెచ్చుమీరుతున్నాయి. అందుకు ఇటీవల జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారులు చేసిన దాడులే ఉదాహరణ.

ప్రభుత్వ శాఖల్లో పెచ్చుమీరిన అవినీతి

- తరచూ ఏసీబీకి పట్టుబడుతున్న ఉద్యోగులు
- జైలు పాలవుతున్నా వెరవని వైనం
- ఇటీవల తాండూరు, వికారాబాద్‌లో పలువురి సస్పెన్షన్
- తాజాగా పరిగిలో అడ్డంగా దొరికిన అటవీశాఖ అధికారులు

పరిగి: ఏసీబీ అధికారులు వరుస దాడులు చేసినా అవినీతి మాత్రం ఆగడం లేదు. తరచూ ఎక్కడో ఒక చోట ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కుతున్నారు. తాజాగా శుక్రవారం పరిగి అటవీశాఖలో ఇద్దరు సెక్షన్ ఆఫీసర్లు, డ్రైవర్ ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డారు. ఆరు నెలల్లోనే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పదుల సంఖ్యలో సర్కారు ఉద్యోగులు లంచం తీసుకుంటూ దొరకగా.. వికారాబాద్ జిల్లాలోనే నాలుగు శాఖల అధికారులు పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా ఉండి సేవలందించాల్సిన ఉద్యోగులు అక్రమాలకు తెగబడుతున్నారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలంటూ వచ్చిన సామాన్యులను పీల్చిపిప్పి చేస్తున్నారు. ఆపై పని చేయడానికి లంచం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ప్రచారం. విసిగిపోయిన బాధితులు ఏసీబీని ఆశ్రయించడంతో అవినీతికి పాల్పడుతున్న అధికారులను పట్టుకొని కటకటాలకు పంపిస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో వివిధ శాఖల్లో ఏసీబీ దాడులు నిర్వహించి ఆరు మంది ప్రభుత్వ ఉద్యోగులను పట్టుకుంది.



ఏసీబీకి పట్టుబడిన అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్, డ్రైవర్ (ఫైల్)

మచ్చుకు కొన్ని ఘటనలు

- పరిగి అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ దాడులు నిర్వహించింది. సీతాఫలాల టెండర్ల వాహనాల పర్మిట్‌ల కోసం డ్రైవర్ సహాయంతో డబ్బులు తీసుకుంటుండగా సెక్షన్ ఆఫీసర్లను రెడ్‌హ్యాండ్‌గా ఏసీబీ పట్టుకుంది. కాంట్రాక్టర్ దగ్గర వాహనాలకు పర్మిట్ కోసం కుల్కచర్ల, కుస్మసముద్రం సెక్షన్ ఆఫీసర్లు మొయినుద్దీన్, సాయికుమార్ డబ్బులు డిమాండ్ చేశారు. డ్రైవర్ బాలకృష్ణ సహాయంతో డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు.
- మోమిన్‌పేట మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఇటీవల ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఫర్టిలైజర్ దుకాణం అనుమతుల కోసం ఏఓ జయశంకర్ రూ.50వేలు తీసుకుంటుండగా ఏసీబీ దాడి చేసి పట్టుకుంది.
- తాండూరు ఆర్డీఓ కార్యాలయంలో దుద్యాల మండలంలోని ఓ భూమి విషయంలో సీనియర్ అసిస్టెంట్ రూ.5 లక్షల డిమాండ్ చేయడంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావును అదుపులోకి తీసుకున్నారు.
- ఇంటి నంబర్ కోసం తాండూరు మున్సిపల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమేశ్ డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. రూ.20వేలు తీసుకుండగా రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు.

ఆగని వ్యవహారం

జిల్లాల్లోని ఆయా ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులను కటకటాల్లోకి నెట్టుతున్నారు.లంచం తీసుకుంటూ దొరకడంతో జైలు పాలవడంతో పాటు, ఉద్యోగాలు సైతం ఊడుతున్నాయి. ఇంత జరుగుతున్నా క్షేత్రస్థాయిలో అవినీతి మాత్రం ఆగడం లేదు. అడ్డదారుల్లో కాసులు దండుకునే ప్రయత్నంలో అందరూ బలి అవుతున్నారు. కొన్ని చోట్ల కొంత మంది అధికారుల ప్రమేయం లేకున్నా ఆ రోజు జరిగిన ఘటనతో వారి ఉద్యోగాలు సైతం ప్రమాదంలో పడి పోతున్నాయి.

శ్రీవారి ఆలయ అభివృద్ధికి శ్రీకారం

రూ.110 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం

- నిర్వాసితులకు రూ.24 కోట్ల పరిహారం కేటాయింపు
- వైఖానస శాస్త్రోక్తంగా విస్తరణ పనులు

కొడంగల్: పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఆలయాన్ని రూ.110 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. దేవాలయ విస్తరణలో భాగంగా ఇళ్లు, ఇంటి స్థలాలు, భూములు కోల్పోతున్న నిర్వాసితులకు రూ.24 కోట్లు పరిహారంగా ఇవ్వనున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు బాధితులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించిన తర్వాత పనులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. వచ్చే వారంలో చెక్కులు పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా విస్తరణ పనులు జరుగుతాయని వెల్లడించారు.

వంద కుటుంబాల నుంచి

భూమి, ఇంటి విలువను బట్టి నష్ట పరిహారంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లిస్తారు. ప్రస్తుతం ఆలయం చుట్టూ ఉన్న సుమారు వంద కుటుంబాల నుంచి 8,736 గజాల ప్రైవేట్ స్థలాన్ని సేకరిస్తున్నారు. ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రత్యేక ప్యాకేజీతో పాటు 125 గజాల ప్లాటు ఇవ్వనున్నారు. నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని అధికారులు చెబుతున్నారు. భూమి, భవనం విలువను ఆర్‌అండ్‌బీ అధికారులు లెక్క కడతారు. అందుకు తగ్గట్టుగా పరిహారం చెల్లిస్తారు. అదనంగా రూ.7.5లక్షల సాయం, ఒక ఏడాది కుటుంబ అవసరాల కోసం రూ.40వేలు, ఇల్లు ఖాళీ చేసి వెళ్లడానికి అయ్యే ఖర్చు(ట్రాన్స్‌పోర్ట్) రూ.60 వేలు, పశువుల దొడ్డి నిర్వహణకు రూ.25 వేలు, చేతి వృత్తులు, కుల వృత్తుల వారికి రూ.30 వేలు, ఇతర ఖర్చుల కోసం రూ.60వేలు చెల్లిస్తారు. ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తారని అధికారులు పేర్కొన్నారు.

తిరుమల తరహా నిర్మాణాలు

కొడంగల్ శ్రీవారి ఆలయాన్ని రూ.110 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా విస్తరణతో పాటు నిర్మాణ పనులు జరుగుతాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, వాస్తు నిపుణులు శ్రీవారి ఆలయ విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆలయ పునరుద్ధణ పనుల్లో భాగంగా నిర్మాణంతో పాటు వివిధ పనులకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు. ఆలయాన్ని విస్తరించి మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. తిరుమల తరహాలో వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా క్యూలైన్, కల్యాణ మండపం, కల్యాణ కట్ట, పూజా మందిరాలు, వసతి గదులు, స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు, పార్కింగ్, పుష్కరిణి, ప్రసాదం కౌంటర్లు, మాడ వీధులు తదితర వాటిని నిర్మిస్తారని ప్రకటించారు.



కొడంగల్ ఆలయ గోపురం

"బాధితులందరికీ పరిహారం



ఇళ్లు కోల్పోతున్న వారందరికీ పరిహారం అందుతుంది. అధికారులు లెక్క కట్టి ఎవరికీ నష్టం జరగకుండా చూస్తారు. సుమారు వంద మందికి రూ.24 కోట్లు పరిహారంగా ఇవ్వడానికి కృషి చేస్తున్నారు. త్వరలో చెక్కులు పంపిణీ చేస్తారు.

– రాజేందర్‌రెడ్డి, ఈఓ, కొడంగల్

రెండేళ్లకు చిక్కిన హంతకుడు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, పోలీసులు, చిత్రంలో నిందితుడు (గులాబీ రంగు చొక్కా)

- సిద్దిపేటలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- న్యాయస్థానంలో హాజరుపర్చి, రిమాండ్‌కు తరలింపు

తాండూరు: హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడిని రెండేళ్ల తర్వాత పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ నగేష్ శనివారం విలేకరులకు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మన్‌సన్‌పల్లికి చెందిన ముధావత్ రవి(39) వ్యవసాయ పనులు చేస్తూ జీవించేవాడు. గ్రామ శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో పనిచేసే నిజామాబాద్ జిల్లా మద్నూర్‌కు చెందిన బాలయ్య అలియాస్ బాలాజీతో ఇతనికి స్నేహం కుదిరింది. ఈక్రమంలో పలుమార్లు మద్యం తాగేందుకు రవి వద్ద బాలాజీ రూ.2,050 అప్పు తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో పలుమార్లు అడగగా, రవి తన పరువు తీస్తున్నాడని కక్షపెంచుకున్న బాలాజీ 2023 ఆగస్టు 12న మద్యం తాగుదామంటూ తాను పనిచేసే ఫామ్‌హౌస్ వద్దకు పిలిచాడు. అనంతరం పథకం ప్రకారం కత్తితో పొడిచి పారిపోయాడు. ఆస్పత్రి పాలైన బాధితుడు చికిత్స పొందుతూ ఆరు రోజుల తర్వాత, 18న మరణించాడు. దీంతో నిందితుడైన బాలాజీపై హత్య, అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. నాటి నుంచి హంతకుడి కోసం పోలీసులు వెతుకుతున్నా ఆచూకీ లభించలేదు. ఇటీవల మృతిచెందిన తన తల్లి అంత్యక్రియలకు కూడా రాలేదు. కొన్నాళ్లుగా అతని కుటుంబ సభ్యుల కదలికలపై నిఘా పెట్టి పోలీసులు, కాల్ డాటా ఆధారంగా నిందితుడు సిద్దిపేటలోని తన సోదరుడైన సంజీవ్ ఇంట్లో ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు. హత్య అనంతరం చాన్నాళ్ల పాటు మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లా వీసాపూర్‌లో తలదాచుకున్నాడని విచారణలో తెలిసిందని డీఎస్పీ తెలిపారు. హత్య చేసిన బాలాజీని న్యాయస్థానంలో హాజరుపర్చి, రిమాండ్‌కు తరలించారు. కేసులో కీలకంగా పనిచేసిన పోలీసులు అమ్జద్, శివకుమార్, మున్నయ్యను అభినందించిన డీఎస్పీ, రివార్డులు అందజేశారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్
- సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

కొడంగల్ రూరల్: ఉపాధ్యాయుల పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సంఘం జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెన్షనర్ జీపీఎఫ్ నిధులు, టీఎస్‌జీ ఎల్‌ఐసీ నిధులు, సరెండర్ లీవులు వంటి అన్ని రకాల పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీంను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు బేసిక్ పే కల్పిస్తూ రెగ్యులరైజ్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న 5డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అధ్యక్షుడిగా వేణుగోపాల్..

ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా ఎం.పాండు, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎండీ. షఫీ, బసిరెడ్డి, పవన్‌కుమార్, శ్రీనివాసరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా విష్ణుకుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శిగా దయాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్, పరమేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో పోటీకి ఫార్మా బాధితులు

- ఎలక్ట్రోరల్ రోల్ కాపీల అందజేతలో ఆర్డీఓ నిర్లక్ష్యం
- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన రైతులు
- కొంతమందికే సర్టిఫైడ్ కాపీల అందజేత

యాచారం: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచేందుకు ఫార్మాసిటీ భూ బాధితులు రెడీ అయ్యారు. సుమారు యాభై మందికిపైగా పోటీలో ఉండాలని భావించినప్పటికీ ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్‌రెడ్డి తమకు సకాలంలో ఎలక్ట్రోరల్ రోల్ కాపీలు అందజేయలేదని తెలిపారు. శనివారం రాత్రి 7 గంటల వరకు కార్యాలయం వద్దే వేచి చూశామని, ఓపిక నశించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో 7 గంటల తర్వాత కొందరికి మాత్రమే ఇచ్చారని వివరించారు. తాము బరిలో ఉంటే ప్రభుత్వానికి అంత భయమెందుకని ప్రశ్నించారు. ఆదివారం నామినేషన్లు సమర్పిస్తామని తెలిపారు.



ఎలక్ట్రోరల్ రోల్ కాపీలు చూపిస్తున్న రైతులు

క్లుప్తంగా

కేజీబీవీ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు, సిబ్బంది

ధారూరు: డ్రగ్స్, మత్తుపదార్థాలతో కలిగే అనర్థాలపై ధారూరు కేజీబీవీ విద్యార్థులకు శనివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మహిళ, శిశుసంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికార కేంద్రం ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవంలో పాల్గొని సత్తాచాటిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత నిపుణులు రాందాస్, సఖీ సెంటర్ ఇంచార్జి రేష్మా, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల బియ్యాన్ని ఎలా తింటారు?



పురుగుల బియ్యాన్ని చూపిస్తున్న వీరప్ప

తాండూరు రూరల్: రేషన్ బియ్యం పంపిణీలో పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గాజీపూర్ మాజీ సర్పంచు తలారి వీరప్ప ఆరోపించారు. శనివారం గ్రామంలోని రేషన్ దుకాణం వద్ద పంపిణీ చేసిన బియ్యంలో పురుగులు ఉన్నాయని, ఉల్లెడ పట్టిన బియ్యాన్ని ప్రజలు ఎలా తినాలని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటోందని మండిపడ్డారు. ఇప్పటికైనా నాణ్యమైన బియ్యం సరఫరా చేయకపోతే ఆందోళన తప్పదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ముస్తాఫా, లాలు, అంజి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ సైన్స్‌లో ఐశ్వర్యకు గోల్డ్ మెడల్



బంగారు పతకం అందుకుంటున్న ఐశ్వర్య

కొడంగల్: బీఎస్సీ ఫుడ్ సైన్స్‌లో ప్రతిభ కనబర్చిన పట్టణానికి చెందిన బాకారం ఐశ్వర్య శనివారం హైదరాబాద్‌లో గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీ (కోటీ ఉమెన్స్ కాలేజీ)లో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ తీసుకున్నారు.


నీటి సంపులో పడి బాలుడి మృతి



నిఖిల్ తేజ్ (ఫైల్)

యాలాల: పొట్టకూటి కోసం వలస వెళ్లిన కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది. అనుకోకుండా జరిగిన ఘటనలో నాలుగేళ్ల బాలుడు నీటి మునిగి మృతి చెందడంతో మండలంలోని దేవనూరు గ్రామం శోకసంద్రంలో మునిగింది. గ్రామానికి చెందిన పరమేశ్వర్ భార్య ఇద్దరు కొడుకులతో కలిసి 8 నెలల క్రితం హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడ ప్రాంతానికి వలస వెళ్లాడు. అక్కడ డెలవరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కాగా ఆయన రెండో కుమారుడు నిఖిల్ తేజ్(4) స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లేవాడు. శుక్రవారం సాయంత్రమైన చిన్నారి ఇంటికి రాకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రంలో వాకబు చేశాడు. పిల్లలు అప్పుడే వెళ్లిపోయారని తెలపడంతో చుట్టుపక్కల వెతకగా, స్థానికంగా ఉన్న ఓ నీటి సంపులో విగతజీవిగా నిఖిల్ తేజ్ కనిపించాడు. దీంతో బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. చిన్నారి అకాల మరణంతో స్వగ్రామమైన దేవనూరులో శోకసంద్రంలో మునిగింది.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడు కొప్పర్తి శ్రీను

షాద్‌నగర్: భూమిని కౌలుకు తీసుకొని అక్రమంగా గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిని శనివారం కేశంపేట పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నరహరి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూరు గోదావరికి చెందిన కొప్పర్తి శ్రీను కొంత కాలం క్రితం కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి వచ్చాడు. గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద కొంత భూమిని కౌలుకు తీసుకున్నాడు. ఆ భూమిలో గుట్టుగా గంజాయి మొక్కలను సాగు చేశాడు. సమాచారం అందుకున్న ప్రత్యేక పోలీసు బృందం తనిఖీ చేసి గంజాయి మొక్కలను గుర్తించారు. ఈ మేరకు కొప్పర్తి శ్రీనును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యవేక్షణ లేక.. అధ్వాన స్థితి

రూపురేఖలు కోల్పోతున్న చెరువులు, కుంటలు

- పదిహేడేళ్లుగా నీటి సంఘాలకు ఎన్నికలు బంద్
- పట్టించుకోని ప్రభుత్వాలు



దౌల్తాబాద్ పెద్దచెరువు

దౌల్తాబాద్: రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. దీంతో చెరువులు అధ్వానంగా మారాయి. మరోవైపు మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువులు, కుంటలకు మరమ్మతులు చేసినా వాటిపై అజమాయిషీ లేక నీటి వనరులపై దృష్టి పెట్టేవారు కరువయ్యారు. ఒకప్పుడు చెరువుల అభివృద్ధి నిర్వహణ, ఆయకట్టు నీటి విడుదల పర్యవేక్షణ పనులను నీటి సంఘాల పాలక వర్గాలు చేపట్టేవి. పదిహేడేళ్లుగా ప్రభుత్వాలు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఈ పర్యవేక్షణ కరువైంది. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో పనులు చేపట్టకముందే నిధులు కాజేశారన్న ఆరోపణలు వచ్చాయి.

శిథిలావస్థకు తూములు

గత ప్రభుత్వాలు 100 ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేవి. ఈ ఎన్నికల్లో రైతులు నీటి సంఘం చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను ఎన్నుకునేవారు. పాలకవర్గ సభ్యులు చెరువుల నిర్వహణతో సాగు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకుని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. అంతేకాకుండా రైతులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు సైతం చేపట్టేవారు. గత 17 ఏళ్ల నుంచి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువుల నిర్వహణ అధ్వానంగా మారింది. కొన్ని చెరువుల తూములు, పంట కాల్వలు, అలుగులు శిథిలావస్థకు చేరుకున్నాయి. తూములు పనిచేయక సాగు నీరురాక నిరుపయోగంగా మారాయి. చెరువులపై ఎవరి పెత్తనం లేకపోవడంతో రైతులకు సాగు నీరు అవసరమయ్యే సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభంలో చేపలు పట్టుకోవడం కోసం రాత్రికి రాత్రి చెరువుల నుంచి నీటిని అక్రమంగా ఖాళీ చేస్తున్నారు.

2008లో చివరిసారి

2006వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా వంద ఎకరాల ఆయకట్టుకు పైగా ఉన్న ప్రధాన చెరువులకు రెండు సంవత్సరాల కాలానికి గాను సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం 2008లో ముగిసింది. అప్పటి నుంచి తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమైనా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చెరువులను మరింత అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

సంఘాలతోనే అభివృద్ధి



నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఎన్నుకుంటేనే చెరువులు అభివృద్ధి చెందుతాయి. గతంలో నీటి సంఘాల పాలకవర్గాలు ఉండడం వలన నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా వాటి పర్యవేక్షణ కూడా పకడ్బందీగా ఉండేది. ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికలపై దృష్టి సారించాలి. – **వెంకటయ్య, రైతు, దేవర్‌ఫసల్‌వాద్**

చికిత్స పొందుతూ గర్భిణి మృతి



ఆందోళన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆందోళన



మానస (ఫైల్)

మంచాల: చికిత్స పొందుతూ గర్భిణీ మృతి చెందింది. ఆమె మృతికి ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన మంచాల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన పంతంగి మానస (26) ఏడు నెలల గర్భిణీ. వైద్యం కోసం భర్త మధుతో కలిసి శుక్రవారం ఉదయం మంచాల ప్రభుత్వ వైద్యశాలకు వచ్చింది. అక్కడి వైద్యురాలు పరీక్షించి బలం తక్కువగా ఉందని, గ్లూకోజ్ ఎక్కించారు. కొద్ది సేపటికే ఆమె లోబీపీతో స్పృహ తప్పి పడిపోయింది. దీంతో వెంటనే ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు నగరంలోని కోఠి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఉస్మానియా వైద్యశాలకు పంపించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆమె మృతి చెందింది.

న్యాయం చేయాలంటూ..

మంచాల ప్రభుత్వ ఆస్పత్రి నిర్లక్ష్యంతో మానస మరణించిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, తమరే న్యాయం చేయాలంటూ మంచాల– ఆరుట్ల రోడ్డుపై బైఠాయించారు. వారికి వివిధ పార్టీల నాయకులు మద్దతుగా నిలిచారు. సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఘటనా స్థలానికి చేరుకున్నారు. విషయాన్ని ఫోన్‌లో కలెక్టర్, జిల్లా వైద్యాధికారులు, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడికి వచ్చిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధామాధవి వారి సర్ది చెప్పారు. రూ.లక్ష అందిస్తామని తెలిపారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

మహేశ్వరం: బస్తీల్లో సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటానని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలోని 20వ వార్డు ప్రజలు స్థానికంగా నెలకొన్న అవుట్‌లెట్ తదితర సమస్యల విషయమై ఎమ్మెల్యే సబితారెడ్డిని శనివారం ఉదయం ఆమె నివాసంలో కలిసి విన్నవించారు. స్పందించిన ఆమె వెంటనే కమిషనర్‌కు ఫోన్ చేయడంతో 40 మంది సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అనంతరం ఆమె నేరుగా శ్రీరాం కాలనీకి వచ్చి స్థానికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయమని అన్నారు. బస్తీల్లో నెలకొన్న సమస్యలపై మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవుట్‌లెట్, దెబ్బతిన్న రహదారులకు సంబంధించి డీపీఆర్ రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరెడ్డి కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హామెద్, సీనియర్ నాయకులు నిరంజన్, యంజాల అర్జున్, దూడల శ్రీనివాస్ గౌడ్, నవపేట ఆంజనేయులు, కర్నాటి పద్మ పాల్గొన్నారు.

పోలీస్ స్టిక్కర్ ఉన్న కారులో వచ్చి హల్‌చల్

- ల్యాంకోహిల్స్‌లో సెక్యూరిటీ గార్డులపై దాడి
- 15 మందిపై కేసు నమోదు
- ఐదుగురి అరెస్ట్



దాడి చేసేందుకు వచ్చిన వ్యక్తులు

గచ్చిబౌలి: పోలీస్ స్టిక్కర్ ఉన్న కారులో వచ్చి సెక్యూరిటీ గార్డులపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ల్యాంకోహిల్స్ బ్లాక్ 3ఎల్‌హెచ్‌లో మహరాష్ట్ర కేడర్‌కు చెందిన ఓ ఐపీఎస్ అధికారి తల్లి అద్దెకు ఉంటోంది. ఈ నెల 15న ఉదయం వినాయక రెడ్డి అనే వ్యక్తి ల్యాంకోహిల్స్‌లోని ఫ్లాట్ నెంబర్ 1703కి వెళ్లేందుకు వచ్చాడు. విజిటర్స్ లైన్‌లో కాకుండా రెసిడెన్సీ లైన్‌లో వెళ్లడంతో సెక్యూరిటీ సిబ్బంది అతడిని అడ్డుకున్నారు. పాస్ ఇవ్వడం లేదని చెప్పడంతో ఫ్లాట్ నెంబర్ 1703 నుంచి మురళి అనే వ్యక్తి కిందికి వచ్చాడు. వచ్చీరావడంతో అతను గొడవకు దిగడంతో సెక్యూరిటీగార్డు బాలకృష్ణ అతడిని తోశాడు. దీంతో మురళి సెక్యూరిటీ గార్డుపై చేయడంతో అతను ప్రతి దాడి చేశాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన మురళి సాయంత్రం మరి కొందరితో కలిసి వచ్చి సెక్యూరిటీ గార్డులైన బాలకృష్ణ, చంద్‌లపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో దాదాపు 15 మంది పాల్గొన్నట్లు ఆరోపిస్తూ బాధితులు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు 10 మందికి నోటీసులు ఇచ్చి పంపారు. మరో ఐదురుగురు పరారీలో ఉన్నారు. ఇది ఇలా ఉండగా దాడి చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ సెక్యూరిటీ గార్డులు శనివారం ల్యాంకోహిల్స్‌కు వెళ్లే దారిలో ఆందోళన చేపట్టారు. ఇప్పటికే కేసు నమోదు చేశామని, మరో ఐదుగురు పరారీలో ఉన్నారని రాయదుర్గం పోలీసులు సర్దిచెప్పడంతో వారు ఆందోళన విరమించారు. అయితే ఆ తర్వాత కొద్ది సేపటికే పరారీలో ఉన్న ఐదుగురు వ్యక్తులు పోలీస్ స్టిక్కర్‌ఉన్న కారులో వచ్చి రాయదుర్గం పెట్రోల్ మొబైల్ సిబ్బంది చూస్తుండగానే సిబ్బందిపై దాడికి పాల్పడటంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మహరాష్ట్ర క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ కేసును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. నోటీసులతో సరిపెట్టాలని సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారులను కోరినా అందుకు నిరాకరించి రిమాండ్ చేసినట్లుగా సమాచారం.

ఏసీబీ వలలో విద్యుత్ శాఖ ఏఈ

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ గంధంగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ హిమాయత్ సాగర్ సెక్షన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అమర్‌సింగ్ రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. హైదరాబాద్ ఏసీబీ సిటీ రెంజ్ డీఎస్పీ .శ్రీనివాస్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఏఆర్‌సీకే ప్రాజెక్ట్స్ అపార్ట్‌మెంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు కాంట్రాక్టర్ ఏఈ అమర్ సింగ్‌ను సంప్రదించగా అతను రూ.30 వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం సదరు కాంట్రాక్టర్ శనివారం అసిస్టెంట్ ఇంజనీర్ అమర్‌సింగ్‌కు నగదు అందజేస్తుండగా పోలీసులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ. 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏఈని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థులే దేశ నిర్మాతలు

మొయినాబాద్: దేశ భవిష్యత్తును నిర్మించేది విద్యార్థులేనని న్యూఢిల్లీ యూజీసీ జాయింట్ సెక్రటరీ గోపిచంద్ మేర్గు అన్నారు. అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం 21వ పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 2025 బ్యాచ్‌కు చెందిన 170 మంది ఎంబీఏ స్టూడెంట్లకు పట్టాలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఎస్.కావ్య, కె.అర్చనకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి బాబురావు ఘట్టమనేని, ప్రిన్సిపల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దుండిగల్: డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది..పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం సాయంత్రం గండిమైసమ్మ చౌరస్తాలోని డీపోచంపల్లి యూటర్న్ వద్ద బైక్‌పై వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో దొరికిన ఆధార్ కార్డు ఆధారంగా అతడిని అన్నారం గ్రామానికి చెందిన కుమారస్వామి(38)గా గుర్తించారు. డీసీఎం వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ధ్వంసంపై పరస్పర ఫిర్యాదులు



మన్నెగూడలో విలేకరులతో మాట్లాడుతున్న బాధితులు

పూడూరు: మాజీ సర్పంచ్ కుటుంబంతో తమకు ప్రాణహాని ఉందంటూ బాధితులు బిక్యానాయక్, ప్రభాత్, జంగయ్య తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం మన్నెగూడలో విలేకరులతో మాట్లాడారు. రాకంచర్ల నుంచి పొలాలకు వెళ్లకుండా మాజీ సర్పంచ్ పెంటయ్య, అతని సోదరుడు రాజు రోడ్డుకు అడ్డంగా జేసీబీతో గుంతలు తీయించారన్నారు. ఈ మార్గం వ్యవసాయ పొలాలతో పాటు సిరిగాయిపల్లికి వెళ్తుందని తెలిపారు. రోడ్డును ధ్వంసం చేయడాన్ని ప్రశ్నించిన కారణంగా తన కొడుకుపై దాడి చేశారని రైతు జంగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొలం వద్ద విచారణకు వచ్చి చన్గోముల్ ఎస్ఐ భరత్‌రెడ్డి ఎదుటే బూతు మాటలు తిడుతూ, దాడికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ విషయమై ఎస్ఐని వివరణ కోరగా ఇరువర్గాల వారు పరస్పరం ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

విధులు ముగించుకొని వెళ్తుండగా..

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



శివ (ఫైల్)

కుల్కచర్ల: బతుకుదెరువు కోసం నగరానికి వెళ్లిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. స్థానికుల వివరాల ప్రకారం.. చౌడాపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన సత్యమ్మ మల్లయ్యల కుమారుడైన శివ(21) శంషాబాద్‌లో ఓ ప్రైవేట్ ఫార్మసీ కంపెనీలో విధులు నిర్వహిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున అతడు విధులు ముగించుకొని రూమ్‌కి వెళుతున్నాడు. మార్గమధ్యలో శంషాబాద్‌లో బైక్‌పై యూటర్న్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. అందరితో కలుపుగోలుగా ఉండే యువకుడు ఇలా ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబంలో వెలుగులు నింపుతాడుకున్న కుమారుడు ఇలా తిరిగిరాని లోకాలకు చేరడంతో కుటుంబీకులు తీవ్ర నిర్వేదంలో మునిగిపోయారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్ : ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా యెర్కారం గ్రామానికి చెందిన బొర్ర నరేష్ (22) కొంతకాలంగా కుటుంబసభ్యులతో కలిసి నగరంలోని షేక్‌పేట మండలం ఫిల్మ్‌నగర్‌లో నివసిస్తున్నాడు. కాలుష్య తనిఖీ వాహనంలో పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం తాను దుబాయ్ వెళ్తున్నానని, తన ఫోన్ కలవదని చెప్పి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. నరేష్ కనిపించడం లేదంటూ రాయదుర్గం పోలీస్‌స్టేషన్ సెప్టెంబర్ 30న సోదరుడు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని కవాడిపల్లి గ్రామ శివారులో ఉన్న పెద్దగుట్టపై శనివారం ఉదయం ఓ చెట్టుకు యువకుడి మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా అతని కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుడి సోదరుడు నవీన్ పేర్కొన్నాడ

మైనర్లతో అసభ్యకరమైన కంటెంట్..

రెండు యూట్యూబ్ చానళ్లపై కేసులు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియాలో స్వేచ్ఛ ఉంది కదా అని.. ఏ తరహా కంటెంట్ అయినా చేస్తామంటే కుదరదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మైనర్లతో అసభ్యకరమైన కంటెంట్ చేసిన రెండు యూట్యూబ్ చానళ్లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వ్యూస్, లైక్స్ తో పాటు సోషల్ మీడియాలో ఫేమస్ కావడం కోసం చిన్నారులతో అసభ్యకర కంటెంట్ చేయకూడదన్నారు. ఇది బాలల హక్కుల ఉల్లంఘన మాత్రమే కాదని చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇలాంటి చర్యలు చేసే వారిపై పోక్సో, జువైనల్ జస్టిస్ యాక్ట్ తదితర చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇలాంటి వీడియోలు దృష్టికి వస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

లచ్చిరాంకు ఇంటర్నేషనల్ టీచర్ ఎక్సలెన్సీ అవార్డు



ఉదావత్ లచ్చిరాం

తుర్కయంజాల్: ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయడం, దాతల ద్వారా బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు సౌకర్యాలను సమకూర్చడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని పురపాలక సంఘం పరిధి మునగనూర్‌కు చెందిన ఉదావత్ లచ్చిరాంకు ఇంటర్నేషనల్ టీచర్ ఎక్సలెన్సీ అవార్డు దక్కింది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బీహార్‌కు చెందిన లీగ్ అకాడమిక్ ప్రొఫెషనల్ ఇంటర్ డిసిప్లినరీ సొసైటీ, నీరజ్ గ్రీన్ ఇండియా పరివార్ ఫౌండేషన్ సీఈఓలు డా. నీరజ్ గుప్తా, ప్రొఫెసర్ నార్వర్ శనివారం మెయిల్ ద్వారా సర్టిఫికెట్ పంపించినట్లు లచ్చిరాం తెలిపారు. ఈయన ప్రస్తుతం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ అవార్డు వరించడం ఎంతో సంతోషంగా ఉందని, మరింత ఉత్సాహంతో పేద విద్యార్థులకు చేయూత అందిస్తానని పేర్కొన్నారు.

ప్రయాణికుల నిలువు దోపిడీ

బీసీ బంద్‌ను భారీగా సొమ్ము చేసుకున్న ప్రైవేట్ వాహనాలు

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు
- దీపావళి సందర్భంగా సొంత ఊళ్లకు తరలిన జనం ఇక్కట్లు



సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేట్ వాహనాలు బీసీ బంద్‌ను భారీగా సొమ్ము చేసుకున్నాయి. దీపావళి వేడుకలు, వరుస సెలువుల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి సొంత ఊళ్లకు బయలుదేరిన నగరవాసుల పైన దారిదోపిడీకి పాల్పడ్డాయి. సాధారణ రోజుల్లో విధించే చార్జీలపైన రెట్టింపు వసూలు చేశాయి. బంద్ సందర్భంగా సిటీబస్సులతో పాటు దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు సైతం నిలిచిపోయాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్కడికక్కడ డిపోలకే పరిమితమయ్యాయి. మహాత్మాగాంధీ, జూబ్లీ బస్‌స్టేషన్ల నుంచి జిల్లాలకు రాకపోకలు సాగించే బస్సులను కూడా నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అప్పటికే బస్‌స్టేషన్‌లకు చేరుకున్న ప్రయాణికులు ఏదో ఒకవిధంగా సొంత ఊళ్లకు వెళ్లేందుకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. దీంతో క్యాబ్‌లు, టాటాఏస్‌లు, మ్యాక్సీక్యాబ్‌లు, తదితర వాహనదారులు అడ్డగోలుగా దోచుకున్నాయి. గత్యంతరం లేకపోవడంతో ఎక్కువ చార్జీలను చెల్లించి వెళ్లాల్సి వచ్చింది. బీసీ బంద్ దృష్ట్యా హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాలకు రాకపోకలు సాగించే సుమారు 3500 బస్సులు స్తంభించాయి. మరోవైపు నగరంలోని 25 డిపోల్లో మరో 2850 కి పైగా సిటీ బస్సులు సైతం డిపోలకే పరిమితమయ్యాయి. వీకెండ్ కావడంతో వివిధ అవసరాల నిమిత్తం ఇంటి నుంచి బయటికి వచ్చిన జనాన్ని ఆటోవాలాలు దోచుకున్నారు.సెవెన్ సీటర్ ఆటోలు, శేర్ ఆటోల్లో సైతం రెట్టింపు చార్జీలు వసూలు చేశారు.

ఇష్టారాజ్యంగా వసూళ్లు...

ఓలా, ఉబెర్, ర్యాపిడీ వంటి సంస్థలతో అనుసంధానమయ్యే క్యాబ్ డ్రైవర్‌లు తమ వాహనాలను బంద్ దృష్ట్యా జిల్లాలకు మళ్లించారు. మరోవైపు పలు ఐటీ సంస్థలకు వాహనాలను నడిపే ట్రావెల్ ఏజెంట్లు సైతం దీపావళి రద్దీని సొమ్ము చేసుకొనేందుకు రోడ్డెక్కాయి. ఉప్పల్, ఎల్బీనగర్, జేబీఎస్, ఆరాంఘర్, బీఎన్‌రెడ్డినగర్, తదితర ప్రాంతాల నుంచి జిల్లాలకు రాకపోకలు సాగించాయి. ప్రయాణికుల రద్దీకనుగుణంగా వివిధ ప్రాంతాల్లో ప్రైవేట్ క్యాబ్‌లు బారులు తీరాయి. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి హన్మకొండ వరకు ఆర్టీసీ లగ్జరీ బస్సుల్లో రూ.250 నుంచి రూ.300 వరకు చార్జీ ఉంటుంది. సాధారణ రోజుల్లో ఈ రూట్‌లో రాకపోకలు సాగించే క్యాబ్‌లు సైతం ఈ చార్జీలను వసూలు చేస్తాయి. కానీ బంద్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని క్యాబ్‌వాలాలు రూ.500 నుంచి రూ.700 వరకు వసూలు చేయడం గమనార్హం. ఎల్బీనగర్ నుంచి విజయవాడ, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సైతం ఇదేవిధంగా క్యాబ్‌వాలాల దారిదోపిడీకి గురయ్యారు.

మెట్రోలు ఫుల్...

బీసీబంద్ దృష్ట్యా మెట్రో రైళ్లు కిక్కిరిశాయి. నాగోల్–రాయదుర్గం, ఎల్బీనగర్–ఎంజీబీఎస్ రూట్‌లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్, నాంపల్లి రైల్వేస్టేషన్‌లకు వెళ్లే ప్రయాణికులు మెట్రోలను ఆశ్రయించారు. మరోవైపు ఆటోరిక్షాలకు సైతం డిమాండ్ పెరిగింది. ఓలా, ఉబెర్, ర్యాపిడో ఆటోల్లోనూ చార్జీలు అమాంతంగా పెరిగాయి.బంద్ కారణంగా ఆసుపత్రులకు వెళ్లే వారు, అత్యవసర పనుల పైన బయటకు వెళ్లిన వాళ్లు పెద్ద మొత్తంలో సమర్పించుకోవాల్సి వచ్చింది.

బంద్ ప్రశాంతం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు మద్దతుగా అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, బీసీ సంఘాలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. ప్రజారవాణా స్తంభించినప్పటికీ బంద్ ప్రశాంతంగా కొనసాగింది. సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, తదితర వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, తెలంగాణ జనసమితి అధ్యక్షులు కోదండరాం, తదితరులు నారాయణగూడ వైఎంసీఏ నుంచి కాచిగూడ చౌరస్తా, కోఠీ , సుల్తాన్ బజార్, రామకోఠీ, బొగ్గులకుంట మీదుగా అబిడ్స్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అరుణోదయ సాంస్కృతి సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క, సీపీఐ సీనియర్ నాయకులు నారాయణ, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ , సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు గోవర్ధన్, తెలంగాణ జన సమితి నాయకులు ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు, సీపీఐఎల్ ఎల్ మాస్ లైన్ హన్మేష్, గదేగోని రవి, తదితరులు పాల్గొన్నారు.